సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



ఆస్తి కోసమే డాడీ హోం రాజారెడ్డి హత్య

డాడీ హోం నిర్వాహకుడు రాజారెడ్డిని ఆస్తి కోసమే సొంత తమ్ముడేమరో ఇద్దరి సాయంతో గొంతునులిమి హతమార్చాడు. - IIలో



అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కడప నగరంలోని రౌడీ షీటర్ షేక్ ఇబ్రహీం (23) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. - IIలో

గరిష్టం/కనిష్టం
34.4 /25.8

వాతావరణం

జిల్లాలో సోమవారం 25.8 - 34.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

వచ్చేనెల 9న జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్ : జాతీయ న్యాయసేవాధికారసంస్థ, రాష్ట్ర న్యాయసేవాధి కారసంస్థ, జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌ను ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలనీ నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి, ఇన్‌ఛార్జ్ ప్రధాన న్యాయమూర్తి జి. గీత, డిఎల్ఎస్ఏ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్‌లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 08562- 258622, 244622 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

16న జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో ఈనెల 16వ తేదీ బుధవారం 5 జిల్లాల జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌జూనియర్ బాలబాలికల విభాగంలో నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 99120 20424 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

స్టాఫ్ నర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

కడప రూరల్ : జాతీయ ఆరోగ్య పథకం కింద అర్హులైన అభ్యర్థులు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. యూపీహెచ్‌సీ, ఎన్‌టీఎస్‌యూ, ఎస్ఎన్‌సీయూ, డీఈఐసీ ప్రోగ్రాంల కింద పనిచే సేందుకు అభ్యర్థులు ఖాళీలు, దరఖాస్తు నమూనా, నెలసరి వేతనం తదితర వివరాలను కడప.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్ సైట్‌లో చూడవచ్చన్నారు. దరఖాస్తులను ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని డ్రాప్ బాక్స్‌లో అందజేయాలన్నారు. నిర్దేశిత గడువు తరువాత, పోస్ట్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోబోమని తెలిపారు.

సీఎం శౌర్య పతకానికి ఎంపిక



కానిస్టేబుల్ సిద్ధయ్య

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండలం పరిధిలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన సిరివెల్ల సిద్ధయ్య అనే కానిస్టేబుల్ సీఎం శౌర్య పతకానికి ఎంపికయ్యారు.మంగళవారం విజయవాడలో జరిగే స్వాతంత్ర్య వేడుకలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పతకాన్ని అందుకుంటాడు.తుమ్మలపల్లి గ్రామానికి చెందిన సిరివెల్ల పెద్దబాబయ్య, పీరమ్మల కుమారుడు సిరివెల్ల సిద్ధయ్య 2013లో పోలీస్ డిపార్టుమెంట్‌లో చేరాడు. సిద్ధయ్య పతకానికి ఎంపికైనందుకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరో బీఎల్ఓపై సస్పెన్షన్ వేటు

కడప సెవెన్‌రోడ్స్ : విధి నిర్వహణలో అలసత్వం వహించిన మరో బీఎల్ఓను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయ్‌రామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024కు సంబంధించి జిల్లాలో చేపడుతున్న ఇంటింటి సర్వేలో విధుల్లో తీవ్ర అలసత్వం వహించినందుకుగాను వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లెకు చెందిన బీఎల్ఓ విజయ్ కుమార్ నాయక్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ సోమవారం రాత్రి ఉత్తర్వులను జారీ చేశారు. ఇంటింటి సర్వేకు సంబంధించి గడువు సమీపిస్తున్నా విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న వారిపై జిల్లా కలెక్టర్ వరుసగా సస్పెన్షన్ వేటు వేస్తున్నారు. ఇంటింటి సర్వేలో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని. విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని ఆయన పేర్కొన్నారు.

వీరభద్రుడికి పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగుతున్న భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు.

పోరాట స్ఫూర్తి..స్వాతంత్ర్య దీప్తి

నేడు స్వాతంత్ర్య దినోత్సవం



కడప కల్చరల్ : బానిసత్వపు నరకాన్ని ప్రత్యక్షంగా అనుభవించిన భారతీయుడు బ్రిటీషర్ల నుంచి విముక్తి పొందేందుకు, దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ప్రాణాలను లెక్కచేయక పోరాడారు. తెల్లవారి తుపాకీ గుండ్లకు గుండెను అడ్డం పెట్టి వీరోచిత పోరాటం చేశారు. వారి సాహసాలు, స్వాతంత్ర్య దీక్ష అందరి మనసుల్లో చెరగని ముద్ర వేశాయి. ఈ తీపి గుర్తులు తరతరాలుగా వారసత్వ సంపదగా కొనసాగుతూనే ఉన్నాయి. 1947 ఆగస్టు 15 భారత దేశానికి తారకమంత్రంగా నిలిచిపోయింది. నవోదయాన్ని ప్రసాదించిన ఆరోజును తలుచుకుంటూ ప్రజలు అందుకు కారణమైన మహనీయులను అడుగడుగునా స్మరించుకుంటున్నారు. దేశమంతటా మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించుకోనున్నారు.

పులకిస్తూ...పునరంకితమవుతూ...

స్వాతంత్ర్యం కలను నిజం చేసుకున్న సంఘటన మన దేశ చరిత్రలో మరుపురానిదిగా నిలిచిపోయింది. భవిష్యత్తులో కూడా దేశ రక్షణ, అభివృద్ధికి పునరంకితమవుతామని చెప్పేందుకు అందరూ ఒకచోట చేరి ఆ మువ్వెన్నల పతాకం నీడలో ప్రమాణం చేసేందుకు జిల్లా కేంద్రమైన కడపలోని పోలీసు పెరేడ్ గ్రౌండ్స్ అధికారికంగా సిద్ధమైంది.అలాగే దాదాపు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలను నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలలను రంగురంగుల కాగితాలతో అలంకరించారు. మంగళవారం ఉదయం జాతీయ జెండాను ఎగురవేసేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రజలందరిలో ఈ సందర్భంగా దేశభక్తి, జాతీయ భావం ఉప్పొంగుతోంది.

అమరవీరుల స్మరణలో..

స్వాతంత్ర్య పోరాట ఘట్టాన్ని తలుచుకుంటూ అమరులైన వారిని, వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ భావి తరాలకు స్ఫూర్తినిచ్చేందుకు వారి పేరిట వీధులను ఏర్పాటు చేసి వారి పట్ల గౌరవాన్ని ప్రకటించుకున్నారు. కేవలం కడప నగరంలోనే మూడుచోట్ల మహాత్మాగాంధీజీ విగ్రహాలున్నాయి. రాయచోటి, పులివెందుల, రాజంపేట, జమ్మలమడుగుతోపాటు ఇంకా పలు మండల కేంద్రాల్లో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేశారు. దాదాపు అన్ని పట్టణాలలో గాంధీజీ విగ్రహం ఉంది. కడప నగరంలో ఆయనతోపాటు ప్రకాశం పంతులు, కడప కోటిరెడ్డి, పెంచికల బసిరెడ్డి, పొట్టిశ్రీరాములు, బీఆర్ అంబేడ్కర్ తదితర విగ్రహాలు కూడా ఉన్నాయి. ఇవేగాక వీధులకు కూడా దేశ నాయకుల పేర్లు పెట్టుకుని వారికి ప్రజలు నివాళులర్పిస్తున్నారు.

అంతా...త్రివర్ణమయం

భారత ప్రభుత్వం పిలుపుమేరకు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా అంతటా త్రివర్ణ పతాకాలు కనిపిస్తున్నాయి. పట్టణాలు, నగర కూడళ్లతోపాటు ప్రధానరోడ్ల వెంబడి మువ్వన్నెల కాంతులీనే రంగురంగుల విద్యుత్ దీపాలను అలకరించారు.

నేటి కార్యక్రమాలు

కడప సెవెన్‌రోడ్స్ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం ఉదయం 8.30 గంటలకు నగరంలోని పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో ప్రారంభం కానున్నాయి. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ 9.00 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. 9.05 గంటలకు పోలీసు గౌరవ వందన స్వీకరణ, కవాతు పరిశీలన ఉంటాయి. 9.15 గంటలకు జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. 9.45 గంటలకు మార్చ్‌ఫాస్ట్, 9.50 గంటలకు స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలకు సత్కారం, 10.00 గంటలకు ప్రగతి శకటాల ప్రదర్శన, 10.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 10.55 గంటలకు ఫోటో సెషన్, 11.05 గంటలకు ప్రశంసాపత్రాలు అందజేత, 11.55 గంటలకు స్టాల్స్ సందర్శన, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ, 12.55 గంటలకు జాతీయ గీతాలాపనతో ముగింపు కార్యక్రమం జరుగుతుంది.

ఘనంగా ఏర్పాట్లు

కడప కల్చరల్ : 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కడప పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పర్యవేక్షణలో పలు శాఖల అధికారుల సమన్వయంతో ప్రధాన వేదికను కనువిందుగా అలంకరించారు. వేదికకు కుడి వైపున ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖుల కోసం, కార్యక్రమానికి హాజరు కానున్న స్వాతంత్ర్య సమరయోధులు, వారి ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఎడమవైపు నగర ప్రముఖులు, ప్రజల కోసం కుర్చీలు ఏర్పాటు చేశారు.

కలెక్టర్ ఆహ్వానం

కడప నగరం పోలీసుపెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు, ప్రజలు, విద్యార్థులు తప్పక హాజరై కార్యక్రమాలను జయప్రదంచేయాలని కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో కోరారు. గురువారం ఉదయం 8.35 నుంచి 77వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు.జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.



కడప: ఐటీఐ సర్కిల్‌లో గాంధీ విగ్రహానికి విద్యుద్దీపాలంకరణ



విద్యుద్దీపాలంకరణలో కోటిరెడ్డిసర్కిల్



పోలీసు గ్రౌండ్‌లో శాంతి కపోతాన్ని తీర్చిదిద్దుతున్న పోలీసు సిబ్బంది

అర్జీలు త్వరగా పరిష్కరించాలి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో విజయరామరాజు అర్జీలు స్వీకరించారు. ప్రజలు సమర్పించిన వినతులను పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో మంగళవారం జరిగే 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అధికారులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, స్పెషల్ కలెక్టర్ రామ్మోహన్, డ్వామా, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు యదుభూషణరెడ్డి, ఆనంద్‌నాయక్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024కు సంబంధించి జిల్లాలో జరుగుతున్న ఇంటింటి సర్వే బాధ్యతగా నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్ వేటు తప్పదని కలెక్టర్ విజయరామరాజు హెచ్చరించారు. సోమవారం తన చాంబర్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో తమ పేర్లు తొలగించారన్న ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఈనెల 21వ తేదీలోగా ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి చేయాలన్నారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు మాత్రమే సర్వేలో పాల్గొనాలన్నారు.

బాల్య వివాహాలు చేస్తే సంక్షేమ పథకాలు నిలిపివేత

18 ఏళ్లలోపు ఆడపిల్లలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి వివాహాలకు పాల్పడిన కుటుంబాలకు ప్రభుత్వం అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలను ఆపేస్తామని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. సోమవారం సాయంత్రం తన చాంబర్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండల, సచివాలయ అధికారులతో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జేసీ గణేష్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, డ్వామా పీడీ యదుభూషణరెడ్డి, ఆర్డీఓలు పాల్గొన్నారు.

జగనన్న విద్య, వసతి దీవెనకు నమోదు చేసుకోవాలి

కడప రూరల్ : జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకం కింద లబ్ధి పొందేందుకు విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖడిప్యూటీ డైరెక్టర్ సరస్వతి తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి రెన్యూవల్ విద్యార్థులు ఆయా కళాశాలల్లోని జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. సెప్టెంబరు 10వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలల యాజమాన్యాల ప్రిన్సిపాళ్లు వారి లాగిన్‌లో రెన్యూవల్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 2017–18 నుంచి 2021–22 వరకు కాలేజీ అకడమిక్ ఫర్ఫార్మెన్స్ నమోదు చేయాలన్నారు. అలా నమోదు చేయని పక్షంలో విద్యార్థుల రెన్యూవల్ జరగదని తెలిపారు.జిల్లాలోని కళాశాలల యాజమాన్యాల ప్రధానాచార్యులు, సిబ్బంది రెన్యూవల్ విద్యార్థుల రిజిస్ట్రేషన్ పూర్తి చేసి జిల్లాలోని సంక్షేమ శాఖలకు ఆన్‌లైన్ విద్యార్థుల దరఖాస్తులను వెంటనే పంపాలన్నారు. 2022–23 విద్యా సంవత్సరానికి విడుదలైన జగనన్న విద్యా దీవెన (కళాశాల ఫీజు) పథకం మొత్తాన్ని కళాశాలలకు చెల్లించాలన్నారు.

దేశరక్షణలో సైనికుల సేవలు ఎనలేనివి



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : దేశరక్షణలో సైనికులు చేస్తున్న త్యాగాలు, సేవలు ఎనలేనివని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం వైవీయూలో 'మేరా మట్టి–మేరా దేశ్'కార్యక్రమంలో భాగంగా వీరజవాన్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారతదేశం కర్మభూమి అని, దేశభక్తి ప్రతి పౌరుడిలో ఇమిడి ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి దేశం పట్ల అంకితభావం, దేశభక్తి కలిగి ఉండాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ నేలతల్లికి వందనం.. సైనికులకు అభివందనం కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సుబేదార్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ కార్గిల్‌వార్‌లో ఆయన చేపట్టిన బాధ్యతలు, సైన్యం విజయాలు, యుద్ధఘటనల గురించి వివరించారు. అనంతరం వైవీయూ అధికారులు సైనికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకటరామిరెడ్డి, సూర్యచారిటబుల్ ట్రస్టు చైర్మన్ ప్రభాకర్, డీన్లు, ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ, పారిశ్రామిక ఖిల్లాగా కమలాపురం

ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్

కడప సెవెన్‌రోడ్స్ : వ్యవసాయ, పారిశ్రామిక రంగాల ఖిల్లాగా రాష్ట్ర స్థాయిలో కమలాపురం నియోజకవర్గానికి గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తామని జిల్లా ఇన్‌చార్జిమంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన నియోజకవర్గ సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొని పలు అంశాలను చర్చించారు. 30 ఏళ్లకు పైబడి నిర్వహణలో ఉన్న వ్యవసాయ విద్యుత్ లైన్లు కండక్టర్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందువల్ల విద్యుత్ సరఫరాలో తరుచూ ఎదురయ్యే అంతరాయాలు తగ్గుతాయన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వామికొండ, సర్వరాయసాగర్ పనులు త్వరలో పూర్తి కానున్నాయని తెలిపారు. ఓటరు నమోదుకు చేపడుతున్న ఇంటింటి సర్వే పారదర్శకంగా జరుగుతోందన్నారు. రైతుల సమ్మతి మేరకే చెన్నూరు చక్కెర కర్మాగారాన్ని మూసివేశామన్నారు. అందుకు సంబంధించి రావాల్సిన బకాయిలు పూర్తిగా ప్రభుత్వం చెల్లించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ స్థాపనకు చర్యలు చేపట్టాలని కోరారు. కమలాపురం నగర పంచాయతీకి సంబంధించిన పోస్టులను భర్తీ చేయాలని మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. కడప నగర పాలక సంస్థలో విలీనమైన గ్రామ పంచాయతీల అభివృద్ధికి అదనపు నిధులు మంజూరు చేయాలన్నారు. ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట, పుష్పగిరి దేవస్థాన ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు. అంతకుముందు కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష, ఖరీఫ్ సాగు తదితర వివరాలను మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమావేశంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, ఎస్‌డీసీలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు అభివృద్ధికి కృషి

ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన నియోజకవర్గ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రొద్దుటూరు అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పట్టణాభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేసిందన్నారు. నాడు–నేడు కింద రూ. 110 కోట్లతో పాఠశాలల్లో అభివృద్ధి చేశామన్నారు. 54 వేల డ్వాక్రా సంఘాల రుణమాఫీ చేశామని, రూ. 160 కోట్లతో మైలవరం నుంచి పైపులైన్ ద్వారా ప్రొద్దుటూరు పట్టణానికి తాగునీరు తీసుకొచ్చామని తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆలోచన, ప్రభుత్వ ఉద్దేశాలను అర్థం చేసుకుని క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అంతకు ముందు కలెక్టర్ ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.

ఆశాజనకంగా ఖరీఫ్ సాగు

- జిల్లాలో 19077 హెక్టార్లలో సాగైన పంటలు
- ఇటీవల కురిసిన వర్షంతో ఊపందుకున్న వ్యవసాయ పనులు



వేంపల్లి ప్రాంతంలో సాగులో ఉన్న వేరుశనగ

కడప అగ్రికల్చర్ : ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలైంది. మొన్నటి దాకా పంటల సాగు మందకొడిగా ఉండేది. ఇటీవల రెండు సార్లు మంచి వర్షాలు కురవడంతో జిల్లాలో సాగు ఊపందుకుంది. దీంతోపాటు మరో వారం పది రోజుల్లో కేసీ కెనాల్‌కు నీరు కూడా విడుదలకానుంది. ఇప్పటికే బోర్లు, నదీ పరివాహక ప్రాంతాల్లో నారు మడులను సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో 77135 హెక్టార్ల సాధారణ సాగు ఉండగా ఇప్పటి వరకు నీటి ఆధారంగా పలు ఆరుతడి పంటలకు సంబంధించి 19077 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగయ్యాయి.

పంటల సాగు వివరాలు

జిల్లాలో వరిపంటకు సంబంధించి 33215 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 4986 హెక్టార్లలో సాగైంది. సజ్జ 1027 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 234 హెక్టార్ల విస్తీర్ణంలో, మొక్కజొన్న 574 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 816 హెక్టార్లలో, కంది సాధారణసాగు 3453 హెక్టార్లుకాగా ఇప్పటి వరకు 1026 హెక్టార్లలో, పెసలు 244 హెక్టార్లకుగాను 62 హెక్టార్లలో, మినుము 1818 హెక్టార్లకుగాను 1348 హెక్టార్లలో, వేరుశనగ 5470 హెక్టార్లకుగాను 1763 హెక్టార్లలో, సోయాబీన్ 863 హెక్టార్లకుగాను 402 హెక్టార్లలో, ఆముదం పంట 631 హెక్టార్లకుగాను 255 హెక్టార్లలో, సన్‌ఫ్లవర్ 1170 హెక్టార్లకుగాను 225 హెక్టార్లలో, మిరప 1295 హెక్టార్లకు గాను 359 హెక్టార్లలో, పసుపు 3045 హెక్టార్లకుగాను 457 హెక్టార్లలో సాగయ్యాయి.

అత్యధికంగా మొక్కజొన్న సాగు...

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో మొక్కజొన్న అత్యధిక విస్తీర్ణంలో సాగైంది. జిల్లావ్యాప్తంగా 574 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా 816 హెక్టార్లలో సాగైంది. సాధారణం కంటే అత్యధికంగా 142.16 శాతం సాగైంది. ఇందులో కడప డివిజన్‌లో పరిధిలో 32 హెక్టార్లలో, పోరుమామిళ్ల డివిజన్ పరిధిలో 192 హెక్టార్లలో, మైదుకూరు డివిజన్ పరిధిలో 131 హెక్టార్లలో, పొద్దుటూరు డివిజన్ పరిధిలో 278 హెక్టార్లలో, పులివెందుల్లో డివిజన్ పరిధిలో 88 హెక్టార్లలో, ముద్దనూరు డివిజన్ పరిధిలో 95 హెక్టార్లలో సాగైంది.

జిల్లాలో సాగైన పంటల వివరాలు (హెక్టార్లలో)

పంటపేరు	సాధారణ సాగు	సాగైన పంటలు	సాగు శాతం
వరి	33125	4896	15.01
సజ్జలు	1027	234	22.77
మొక్కజొన్న	574	816	142.16
కంది	3453	1026	30.93
పెసలు	244	62	25.54
మినుము	1818	1348	74.14
వేరుశనగ	5740	1763	30.71
సన్‌ఫ్లవర్	1170	221	17.21
ఆముదం	631	255	40.45
సోయాబీన్	863	402	46.53
పత్తి	21567	6564	30.33
మిరప	1295	359	27.72
పసుపు	3045	477	15.00

సాగు జోరందుకుంది



మొన్నటి దాకా వర్షాలు సరిగా లేవు. దీంతో పంటలసాగు మందకొడిగా ఉండేది. ప్రస్తుతం వర్షాలు ప్రారంభమయ్యాయి. దీంతో పంటలసాగు జోరందుకుంది. జిల్లావ్యాప్తంగా 77315 హెక్టార్లకుగాను ఇప్పటి దాకా 19077 హెక్టార్లలో పలు పంటలను సాగయ్యాయి.

- అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి.

ఫిర్యాదులపై స్పందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ×స్పందన×కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'స్పందన'ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలనీ పోలీసు అధికారులను ఆదేశించారు.సైబర్‌క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ఆన్‌లైన్ వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్ ద్వారా నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)లో, టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ పేర్కొన్నారు.

క్లుప్తంగా

తప్పిపోయిన బాలిక అప్పగింత



బాలికను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

కమలాపురం : కమలాపురం పట్టణం రాంనగర్‌కు చెందిన లక్ష్మి(9) అనే బాలికను రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎర్రగుంట్ల ఆర్‌ఎస్‌ఐ రవిచంద్ర రాజు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రెండు రోజుల క్రితం తన అవ్వతో కలసి గుత్తికి వెళ్లిన బాలిక అక్కడి రైల్వేస్టేషన్‌లో తప్పిపోయింది. ఒంటరిగా సంచరిస్తున్న ఆ బాలికను అక్కడి రైల్వే పోలీసులు గుర్తించి విచారణ చేశారు. తనది కమలాపురం అని, దర్గా పక్కనే ఉన్న రాం నగర్‌లో తన బాబాయి హరి వద్ద ఉంటున్నానని, తన తల్లిదండ్రులు కరోనా సమయంలో మృతి చెందారని చెప్పింది. దీంతో గుత్తి రైల్వే పోలీసులు ఎర్రగుంట్ల రైల్వే పోలీసులకు అప్పగించారు. ఎర్రగుంట్ల ఆర్‌ఎస్‌ఐ రవి చంద్ర రాజు తన సిబ్బందితో కలసి కమలాపురం వచ్చి బాలికను తన బాబాయి హరికి అప్పగించారు. దీంతో వారు రైల్వే పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆస్తి కోసమే డాడీ హోం రాజారెడ్డి హత్య

- ఇద్దరి సాయంతో పథకం ప్రకారం హత్య చేసిన తమ్ముడు
- పోస్టుమార్టం నివేదికలో తప్పుడు రిపోర్టు ఇచ్చిన ప్రభుత్వ డాక్టర్ అరెస్ట్
- లక్ష్మీప్రసన్నను సీఈఓ బాధ్యతల నుంచి తొలగించడమూ కారణమే
- శ్రీధర్‌రెడ్డి, అతని భార్య లక్ష్మీప్రసన్న, డాక్టర్‌తోపాటు మరో ఇద్దరు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్



వివరాలు మీడియాకు వెల్లడిస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : డాడీ హోం నిర్వాహకుడు నల్లదిమ్ము రాజారెడ్డిని ఆస్తి కోసమే హత్య చేశారు. సొంత తమ్ముడే పథకం ప్రకారం మరో ఇద్దరి సాయంతో గొంతునులిమి హతమార్చాడు. సీఈఓ బాధ్యతల నుంచి లక్ష్మీప్రసన్నను తొలగించడం, ఆస్తి గొడవలు హత్యకు ప్రధాన కారణంగా పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులోని ఐదుగురు నిందితులను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్, జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు సోమవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. రాజుపాళెం మండలంలోని పర్లపాడు గ్రామానికి చెందిన డాడీ హోం నిర్వాహకుడు రాజారెడ్డి ఈ నెల 11న రాత్రి పూజా ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో పడిపోవడంతో బంధువులు, పాఠశాల సిబ్బంది జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఆస్పత్రికి వెళ్లి రాజారెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ విషయమై అక్కడి వైద్యులతో మాట్లాడగా గుండెపోటుతో మృతి చెంది ఉండొచ్చని ప్రాథమికంగా తెలిపారు. పూజా స్కూల్ పీఈటీ రామాంజని ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో 12న ఉదయం రాజారెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. గుండె పోటు రావడంతో మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. తర్వాత పోస్టుమార్టం చేసిన డాక్టర్ అసిస్టెంట్‌ని విచారణ చేయడంతో పోస్టుమార్టంలో కొన్ని లోపాలున్నట్లు పోలీసు అధికారులకు అనుమానం వచ్చింది. దీంతో జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప రిమ్స్‌కు చెందిన ప్రొఫెసర్లతో రాజారెడ్డి మృతదేహానికి రీ పోస్టుమార్టం నిర్వహించారు. ఊపిరాడక రాజారెడ్డి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

10 రోజుల నుంచి హత్యకు కుట్ర

రాజారెడ్డి తమ్ముడి భార్య లక్ష్మీప్రసన్న కొన్నేళ్ల నుంచి డాడీ హోం సీఈఓగా కొనసాగుతున్నారు. అయితే ఇటీవల సీఈఓ పదవి నుంచి ఆమెను రాజారెడ్డి తొలగించారు. ఈ బాధ్యతలను డాడీ హోంలో ఉంటున్న అనాథ యువతికి అప్పగించారు. దీంతో లక్ష్మీప్రసన్న దంపతులు ఈ విషయాన్ని బంధువులు, సన్నిహితులతో చెప్పుకొంటూ బాధపడ్డారు. వీరి మధ్య ఆస్తి వివాదాలు కూడా కొన్ని రోజుల నుంచి కొనసాగుతున్నాయి. దీంతో పగ పెంచుకున్న శ్రీధర్‌రెడ్డి, భార్య 10 రోజులుగా రాజారెడ్డిని చంపేందుకు కుట్ర పన్నుతూ వచ్చారు. ఈ క్రమంలోనే చౌడూరుకు చెందిన శివ, కాకిరేనిపల్లెకు చెందిన సుభాన్‌లతో కలసి ఈ నెల 11న రాత్రి పూజా స్కూల్ క్యాంపస్‌లోనే రాజారెడ్డిని గొంతు నులిమి హత్య చేశారు.

రోస్టర్‌లో డాక్టర్ డ్యూటీ లేకున్నా..

ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో డాక్టర్ వీరనాథరెడ్డి జనరల్ సర్జన్‌గా పని చేస్తున్నాడు. ఆయన రాజారెడ్డి ఫ్యామిలీ డాక్టర్. అంతేగాక శ్రీధర్‌రెడ్డితో మంచి సంబంధాలు కలిగి ఉన్నాడు. 11న రాత్రి డాక్టర్ వీరనాథరెడ్డికి డ్యూటీ లేకున్నా జిల్లా ఆస్పత్రిలో ఉన్నాడు. ఆ రోజు రాత్రి రాజారెడ్డి మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. ఆయన మరణానికి గుండె పోటు కారణమని డాక్టర్ వీరనాథరెడ్డి ప్రాథమికంగా తెలియజేశాడు. అంతేగాక మరుసటి రోజు 12న పోస్టుమార్టం చేసి గుండె పోటు వల్లనే రాజారెడ్డి మృతి చెందినట్లు ఆయన తెలిపాడు. పోలీసులకు అనుమానం రావడంతో తిరిగి నిర్వహించిన రీ పోస్టుమార్టంలో ఊపిరాడక రాజారెడ్డి మృతి చెందినట్లు రిమ్స్ ప్రొఫెసర్లు తెలిపారు. పీఎం రోస్టర్‌లో లేకున్నా రాజారెడ్డికి పోస్టుమార్టం నిర్వహించి గుండెపోటు మూలంగా చనిపోయాడని ప్రచారం చేసిన కారణంగా డాక్టర్ వీరనాథరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం

రాజారెడ్డి హత్య కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. ప్రజల్లో ఉన్న కొన్ని అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రెండవ శనివారం, ఆదివారం కావడంతో పూజా స్కూల్ విద్యార్థులకు సెలవులు ఇచ్చారని తెలిపారు. అలాగే పాఠశాలలో గత 10 రోజుల నుంచి విద్యుత్ సమస్య ఉందన్నారు. పాఠశాల ప్రాంగణంలో తెగి పడిన విద్యుత్ వైర్ల విషయమై ఏఎస్పీ మాట్లాడుతూ.. విద్యుత్ వైర్లను ఉద్దేశపూర్వకంగా కత్తిరించారా లేదా అనే దానిపై రిపోర్టు ఇవ్వాలని ఎలక్ట్రికల్ ఏఈకి లెటర్ పెట్టామని చెప్పారు. విద్యుత్ శాఖ నివేదిక ఆధారంగా విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. పూజా స్కూల్‌లో మొత్తం 51 సీసీ కెమెరాలు ఉండగా వాటిలో 5 పని చేయడం లేదని తెలిపారు. వీటిని నిందితులు ఉద్దేశపూర్వంగా పని చేయకుండా చేశారా లేదా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. రాజారెడ్డి ఆస్తులను పరిపాలన నిమిత్తం కలెక్టర్‌కు అటాచ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురిని అరెస్ట్ చేశామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపించనున్నట్లు వివరించారు. తదుపరి విచారణలో ఇతరులు కూడా దోషులుగా తేలితే వారిని కూడా అరెస్ట్ చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, సీఐ ఇబ్రహీం, ఎస్‌ఐలు చిరంజీవి, శివప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య కేసులో యావజ్జీవ శిక్ష



ముద్దాయి ఆనందకుమార్

ప్రొద్దుటూరు క్రైం : తొమ్మిదేళ్ల క్రితం ప్రొద్దుటూరులో పిడి బాకుతో గొంతు కోసి వృద్ధురాలిని హత్య చేసిన కేసులో ముద్దాయి పోలు ఆనందకుమార్‌కు కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మిట్టమడి వీధికి చెందిన పోలు ఆనంద్‌కుమార్ గాంధీపార్కులోని లైబ్రరీలో అటెండర్‌గా పని చేసేవాడు. అతను 2014 సెప్టెంబర్ 19న రాత్రి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వసంతపేటలో నివాసం ఉంటున్న జలదుర్గం మీనాక్షమ్మ (65)ను పిడిబాకుతో పొడిచి ఒంటిపై ఉన్న బంగారు చైన్‌తోపాటు బీరువాలోని వెండి వస్తువులను దోచుకెళ్లాడు. కొద్ది సేపటి తర్వాత వృద్ధురాలు మృతి చెందింది. ఆమె కుమారుడు జలదుర్గం రమేష్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ పర్యవేక్షణలో సీఐ రాజారెడ్డి, కోర్టు మానిటరింగ్ సిబ్బంది నాగరాజు, బ్రహ్మయ్యలు సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. రాంప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈ క్రమంలో నేరం రుజువు కావడంతో రెండవ అదనపు జిల్లా కోర్టు జడ్జి జీఎస్ రమేష్‌కుమార్ సోమవారం పోలు ఆనందకుమార్‌కు యావజ్జీవ కారాగారశిక్షతోపాటు రూ.2.50 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. సాక్ష్యాధారాలతో ముద్దాయికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

విద్యార్థికి తేలు కాటు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలంలోని వేపరాల జెడ్పీహెచ్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ఎ.మహేష్ అనే విద్యార్థి తరగతి గదిలో తేలు కాటుకు గురయ్యాడు. సోమవారం వేపరాల గ్రామానికి చెందిన ఎ.మహేష్ రోజులాగానే పాఠశాలకు వచ్చాడు. తరగతి గదిలో ఉండగా మండరగబ్బ (తేలు) విద్యార్థి ఉన్న చోటుకు వచ్చి కాటు వేసింది. దీంతో నొప్పి రావడంతో విద్యార్థి గమనించాడు. వెంటనే ఉపాధ్యాయులు గమనించి తేలును చంపేశారు. విద్యార్థిని జమ్మలమడుగు ఆస్పత్రికి, ఆ తర్వాత ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు.

విషద్రావణం తాగి..

పెద్దముడియం : మండలంలోని కొండసుంకేసుల గ్రామంలో మూడు రోజుల క్రితం విషద్రావణం తాగిన ధన్నవాడ చెన్నయ్య(35) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొండసుంకేసుల గ్రామానికి చెందిన చెన్నయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చెన్నయ్య గ్రామానికి చెందిన తన బంధువు దావీదుతో కలిసి గ్రామంలో గతంలో స్థలం కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకొని అక్కడే నివాసముంటున్నాడు. కానీ కొనుగోలు చేసిన స్థలం దావీదు పేరు మీద రిజిస్టరు కావడంతో అతను.. 'నువ్వు నిర్మించుకున్న ఇంటి స్థలం నాది నువ్వు ఇల్లు ఖాళీ చేయాలి' అని తెలపడతంతో మనస్తాపానికి గురయ్యాడు. తన ఇంటిలో శనివారం విషద్రావణం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యుల జమ్మలమడుగు ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్‌ఐ రామక్రిష్ణ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు వేయడమంటే ఇదేనా..!



రహదారిలో ఇరుక్కున్న ఓ ప్రైవేటు బస్సు

రాజుపాళెం : టీడీపీ నాయకులు తూతూమంత్రంగా రోడ్డు వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజుల కిందట మండల పరిధిలోని టంగుటూరు గ్రామ సమీపంలో కుందూ నదికి ఇరువైపులా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు గుంతలమయమైన రహదారిలో గ్రావెల్ వేశారు. అయితే రోడ్డు బాగుందని సంతోష పడిన వారికి.. వెంటనే ఇబ్బందులు ఎదురయ్యాయి. రోడ్డు వేశామని టీడీపీ నాయకులు చెప్పుకోవడం తప్ప ప్రయోజనం లేదని ప్రజలు అంటున్నారు. గ్రావెల్ వేసిన అనంతరం రోడ్డు రోలర్‌తో చదును చేయాల్సి ఉంది. అలా చేయకుండా ఆ రోడ్డును అలాగే వదిలేశారు. ఇదిలా ఉండగా సోమవారం సీబీఐటీ, వీబీఐటీ కళాశాల బస్సు అక్కడ 2, 3 గంటల పాటు ఇరక్కుపోవడంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఆళ్లగడ్డ, చాగలమర్రి నుంచి టంగుటూరుకు వచ్చే బస్సులు దువ్వూరు మీద తిరిగి ప్రొద్దుటూరుకు వెళ్లాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- మద్యం మత్తులో కాలు కోసుకున్నాడని సమాచారం
- అతనితోవున్న స్నేహితులను విచారణ చేస్తున్న పోలీసులు
- తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు



షేక్ ఇబ్రహీం మృతదేహం

కడప అర్బన్ : కడప నగరంలోని రౌడీ షీటర్ షేక్ ఇబ్రహీం (23) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రాథమిక సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి. స్నేహితుల కోసం ప్రాణాలను ఇస్తానని అతను మద్యం మత్తులో తన దగ్గరున్న కత్తితో కుడి కాలును కోసుకున్నాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో మరణించాడు. ఈ సంఘటన కడప నగరం పాత మున్సిపల్ కార్యాలయంలోని ఖాళీ ప్రదేశంలో ఈ నెల 13వ తేదీన అర్ధరాత్రి చోటుచేసుకుంది. తన కుమారుడి మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తండ్రి కమాల్ బాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేశారు.

కడప నగరంలోని పెద్ద దర్గా సమీపంలోని బళ్లారి రోడ్డులో ఓ వీధిలో నివాసం వుంటున్న షేక్ కమాల్ బాషా చిలకల బావి సమీపంలో చికెన్ పకోడా అంగడి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు వున్నారు. వీరిలో రెండవ సంతానమైన షేక్ ఇబ్రహీం (23) అనే యువకుడు చెడు వ్యసనాలకు బానిసగా మారాడు. చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ హత్య కేసులో నిందితుడిగా వున్నాడు. కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు కేసుల్లో నిందితుడిగా వున్నాడు. ఇతనిపై పోలీసుల రికార్డుల్లో రౌడీషీట్ నమోదై వుంది. ఇదిలా వుండగా షేక్ ఇబ్రహీం, తన స్నేహితులైన వాసిద్, మొబిన్, గౌస్‌లతో కలిసి ఈనెల 13వ తేదీ రాత్రి కడప నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని ఖాళీ ప్రదేశంలో మద్యం సేవించాడు. ఆ మత్తులో తన స్నేహితులతో మాట్లాడుతూ... తాను స్నేహితుల కోసం ప్రాణాలను ఇస్తానని చెబుతూనే, తన దగ్గరున్న కత్తితో తన కుడికాలును, మోకాలు పైభాగాన కోసుకున్నాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో అతని స్నేహితులతోపాటు, స్థానికులు గమనించి దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ క్యాజువాలిటీకి తీసుకుని రాగానే అతనికి అత్యవసర వైద్యసేవలను అందించినప్పటికీ, తీవ్రంగా రక్తస్రావం కావడంతో మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. ఈ సంఘటన స్థలాన్ని కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్ పర్యవేక్షణలో కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి. నాగరాజు తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. మృతుని తండ్రి కమాల్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు. ఇబ్రహీంతోపాటు వున్న అతని స్నేహితులను పోలీసులు విచారణ చేస్తున్నారు.

అధ్యాపకురాలి హత్య కేసులో మరో ఇద్దరి అరెస్ట్

మదనపల్లె : పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లో ఈ నెల 3న జరిగిన ప్రైవేట్ కళాశాల లెక్చరర్ రుక్సానా హత్య కేసులో మరో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని శివాజీనగర్ చీకలగుట్టకు చెందిన ఎస్.షబ్బీర్‌బాషా అలియాస్ కలిచెర్ల షబ్బీర్‌బాషా, సురభికాలనీకి చెందిన షేక్ ఫారుఖ్‌లను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో మొత్తం 9 మందిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

సీఎంను ఏక వచనంతో మాట్లాడితే నాలుక కోస్తాం!

- పవన్ కల్యాణ్ వాడొక వెదవ
- విరుచుకుపడ్డ ఎమ్మెల్యే రాచమల్లు



ఎమ్మెల్యే రాచమల్లు

కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏకవచనంతో ఇష్టానుసారం మాట్లాడితే జనసేన అధినేత పవన్ కల్యాణ్ నాలుక కోసి చేతిలో పెడతామని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం కలెక్టరేట్‌లో తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడారు. పదేళ్ల నుంచి పవన్ కల్యాణ్ రాజకీయాల్లో ఉంటున్నా పది వార్డు స్థానాలు కూడా గెలిచే శక్తి ఆయనకు లేదన్నారు. రాష్ట్రంలో 151 స్థానాల్లో గెలిచి బలీయమైన శక్తిగా ఉన్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కేంద్రంతో ఆటాడిస్తానంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఎవరికి బలముంటే వారికే కేంద్ర ప్రభుత్వం పలుకుతుందని చెప్పారు. కేంద్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాటే వింటుందని స్పష్టం చేశారు. ఏనుగు వెళుతుంటే కుక్కలు మొరిగిన చందంగా పవన్ కల్యాణ్ వ్యవహారం ఉందన్నారు. జగన్ అనుకుంటే ఎవరినైనా ఆటాడిస్తాడని తెలిపారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఉపయోగించుకుని రాష్ట్ర ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి ఉన్నారన్నారు. పవన్ ముఖ్యమంత్రిని ఆటాడించలేదన్నారు. ఒకవేళ ఎవరినైనా ఆటాడించదలిస్తే ఇంకో ఇద్దరిని పెళ్లి చేసుకుని ఆటాలాడించుకోవాలని సూచించారు. పవన్ కల్యాణ్ ఆడవారితో ఆటాడుకోవాల్సిందే తప్ప సీఎంను ఏం పీకలేదన్నారు. సీఎంను ఏకవచనంతో మాట్లాడుతున్నారని, గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను చెప్పుతో కొడతానంటూ పవన్ మాట్లాడారని పేర్కొన్నారు. నోటికి హద్దు పద్దు లేకుండా మాట్లాడుతున్న పవన్ కల్యాణ్ వాడొక వెదవంటూ మండిపడ్డారు. పవన్ నోరు శుద్ధిగా లేదన్నారు. వారాహి యాత్ర రాయలసీమకు వస్తే జాగ్రత్తగా తిరగాల్సి వస్తుందేమోనన్నారు.

స్కూల్ బస్సును ఢీకొన్న బైక్



మృతి చెందిన శ్రీరాములు అలియాస్ రెడ్డి



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

నిమ్మనపల్లె : విద్యార్థులతో వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సును బైక్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు... కేవీ పల్లె మండలం గర్నిమిట్ట పంచాయతీ లక్ష్మిరెడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులు కుమారుడు శ్రీరాములు అలియాస్ రెడ్డి(20) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. తన బంధువైన కలికిరి మండలం శెట్టిపల్లెకు చెందిన మల్లేష్(21)తో కలిసి మూడు రోజుల క్రితం నిమ్మనపల్లె మండలం దివిటివారిపల్లెలోని బంధువుల ఇంటికి అల్లనేరేడు పంటను కోసేందుకు వచ్చారు. పనులు ముగించుకుని ఇద్దరూ సోమవారం ఉదయం దివిటివారిపల్లె నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామాలకు బయలుదేరారు. మార్గంమధ్యలో కొండయ్యగారిపల్లె పంచాయతీలోని మదనపల్లె-నిమ్మనపల్లె మార్గంలో నిమ్మనపల్లె వ్యవసాయ శాఖ కార్యాలయం సమీపంలో, ఆటోను ఓవర్‌టేక్ చేసి ఎదురుగా వస్తున్న ప్రైవేట్‌స్కూల్ బస్సును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో శ్రీరాములుకు మెడ భాగంలో తీవ్ర గాయాలు కాగా, మల్లేష్‌కు కాలు, చెయ్యి విరగడంతో పాటు తలకు తీవ్ర గాయమైంది. బాధితులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీరాములు అలియాస్ రెడ్డి మృతి చెందగా, మల్లేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక వైద్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. శ్రీరాములు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. నిమ్మనపల్లె ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణంలోని ఎరువుల దుకాణాలపై కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు రెడ్డెప్ప, శేషగిరి ఆధ్వర్యంలో అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. రికార్డులు, అనుమతులు సరిగ్గాలేని రూ. 5,52 లక్షల ఎరువుల విక్రయాలపై నిషేధం విధించారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు ఈ దాడులు కొనసాగాయి. దుకాణాలు, గోడౌన్లలో స్టాకును పరిశీలించారు. ఎరువులు, పురుగుల నివారణ మందుల స్టాకు, విక్రయాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీవిఘ్నేశ్వర, శ్రీకృష్ణా ఎరువుల దుకాణాల్లో రికార్డులు సరిగ్గా లేనట్లు గుర్తించినట్లు వారు పేర్కొన్నారు. దుకాణాలు, గోడౌన్లలో నిల్వ ఉన్న ఎరువులు విక్రయించిన ఎరువుల వివరాలతోపాటు మరి కొన్ని విషయాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయనట్లు గుర్తించామన్నారు. శ్రీవిఘ్నేశ్వర ఎరువుల దుకాణంలో రూ.3,20,850, శ్రీకృష్ణా ఎరువుల దుకాణంలో రూ.2,31,400 మొత్తం రూ. 5,52,250 విలువ చేసే ఎరువులని రైతులకు విక్రయించకూడదంటూ నిషేధం విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఈ కేవీ కిషోర్, ఏవో నాగరత్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.


రివిజన్ కీళ్ల మార్పిడి సర్జరీ విజయవంతం



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ జహింగీర్‌బాషా

కడప రూరల్ : కడప నగరంలో గల జేబీ హాస్పిటల్‌లో రివిజన్ కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆ హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కీళ్ల మార్పిడి, కీ హోల్ సర్జన్ డాక్టర్ జహింగీర్‌బాషా వివరాలు వెల్లడించారు. రహమతుల్లా, నరసింహులు అనే బాధితులు ఇతర ఆస్పత్రుల్లో కీళ్ల మార్పిడి చేయించుకుని చీము పట్టి నడవలేని స్థితిలో ఉండేవారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారు తమ ఆస్పత్రికి రావడం జరిగిందన్నారు. ఆ ఇరువురు బాధితులను పరీక్షించిన తర్వాత చీమును పోగొట్టి రివిజన్ కీళ్ల మార్పిడి సర్జరీని విజయవంతంగా నిర్వహించి, వారిని నడిపించడం జరిగిందన్నారు. ఇటువంటి ఆపరేషన్లు చాలా అరుదైనవని, పెద్దనగరాల్లో మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు. తమ జేబీ హాస్పిటల్‌లో ఇలాంటి రివిజన్‌తోపాటు ఆధునిక సర్జరీలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రైమరీ మోకాళ్ల మార్పిడి చేసే సమయంలో డ్యూయల్ యాంటీ బయోటిక్ టెక్నిక్, హై స్టెరియిటి ఆపరేషన్ థియేటర్‌లో వాడడం వల్ల చీముపట్టే సమస్య చాలా వరకు రాదని తెలిపారు. హాస్పిటల్ సీఈఓ డాక్టర్ జయభారతి మాట్లాడుతూ తమ వద్ద అన్ని రకాల క్రిటికల్ రీప్లేస్‌మెంట్, హిప్ రిప్లేస్‌మెంట్ సర్జరీలను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బాధితులు రహమతుల్లా, నరసింహులుతో పాటు ఆస్పత్రి వైద్యులు ఒబెదుల్లా, వెంకటేశ్వర్లు, పీఆర్వో ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు



తీవ్రంగా గాయపడ్డ ముజీర్

నిమ్మనపల్లె : రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి నిమ్మనపల్లె మండలంలో జరిగింది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె గాండ్ల వీధికి చెందిన దంపతులు ముజీర్(60), షాహినా(50) మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ సాగిబండవారిపల్లెలోని బంధువుల ఇంటికి వచ్చారు. శుభకార్యం ముగించుకుని తిరిగి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళుతున్నారు. బాలినాయనపల్లెకు చెందిన కె.రూపేష్(25) ద్విచక్రవాహనంలో వేగంగా వస్తూ.. వెంగంవారిపల్లె సెల్‌టవర్ వద్ద ఎదురుగా వస్తున్న ముజీర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ముజీర్ తలకు తీవ్ర గాయం కాగా, అతని భార్య షాహినా, మరో ద్విచక్రవాహనంలోని రూపేష్ గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముజీర్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగస్టు 15

ఆమె... దేశంలో సగం ఎప్పుడు!?

స్వాతంత్య్ర దినోత్సవం దేశ ఔన్నత్యాన్ని మాట్లాడుతుంది. దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తుంది. కాని దేశంలో సగమైన స్త్రీలు సంపూర్ణ స్వాతంత్య్ర ఫలాలు ఇంకా పొందవలసే వుంది. ఏనాడైతే స్త్రీల పట్ల సురక్షితమైన, సంస్కారవంతమైన ప్రవర్తనను ఈ సమాజం చూపుతుందో అప్పుడే స్త్రీలకు సంపూర్ణ స్వాతంత్య్రం వచ్చినట్టు. అప్పుడే దేశ ఔన్నత్యం ఇనుమడించినట్టు. 'ఆకాశంలో సగం'లాగా దేశంలో సగం ఇంకెప్పుడు?



నేడు ఆగస్టు 15న ఎర్రకోట మీద జెండా ఎగురవేసే సమయంలో ప్రధాని నరేంద్ర మోడీకి ఇద్దరు మహిళా ఆర్మీ ఆఫీసర్లు సహకారం అందిస్తారు. మేజర్ నికితా నాయర్, మేజర్ జాస్మిన్ కౌర్ పతాకావిష్కరణ సమయంలో ప్రధానితో పాటుగా ఉండి జెండా వందనం సమర్పిస్తారు. ఈ విశేష ఘట్టంలో ఇద్దరు మహిళలకు ఈ విధంగా చోటు దక్కడం సంతోషపడాల్సిన సంగతి. 76 ఏళ్ల క్రితం స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు స్త్రీల స్థితిగతుల్లో వచ్చిన పురోభివృద్ధికి ఇదీ ఒక సంకేతమే. నాటి నుంచి నేటి వరకు విద్య, ఉపాధి, ఉద్యోగం, సైన్యం, పాలనా యంత్రాంగం, శాసన వ్యవస్థ... వీటిల్లో స్త్రీలకు గణనీయంగా స్థానం దక్కింది. ప్రాముఖ్యం లభించింది. అయితే అంతమాత్రాన స్త్రీలు సంపూర్ణంగా స్వాతంత్య్ర ఫలాలు అనుభవిస్తున్నారా అనేది ప్రశ్న.

స్త్రీల త్యాగం

దాస్య భారతంలో జరిగిన స్వాతంత్య్ర పోరాటంలో ఎందరో స్త్రీలు పాల్గొన్నారు. అన్నింటికి మించి పురుషులు దేశం కోసం ప్రాణాలు అర్పించినా, జైళ్ల పాలైనా స్త్రీలు ధైర్యంగా ఇళ్లు నడిపి కష్టాలను ఈదారు. దేశ విభజన సమయంలో తీవ్ర హింసను ఎదుర్కొన్నారు. అంతెందుకు 1930 నాటికి దేశ వ్యాప్తంగా 30 వేల మంది స్త్రీలు స్వాతంత్య్ర పోరాటంలో ఏదో విధాన జైలు శిక్ష అనుభవిస్తున్నారని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఈ స్త్రీల పోరాటం చాలామటుకు చరిత్రలో నమోదు కాకుండానే కాలగర్భంలో కలిసిపోయింది. ఇప్పుడిప్పుడే నాటి వీర వనితల గాథలు వెలికి వస్తున్నాయి. ఇంత పోరాటం, త్యాగం చేసి స్త్రీల భాగస్వామ్యంతో తెచ్చుకున్న స్వాతంత్య్రంలో స్త్రీలు నిజంగా సంతోషంగా ఉన్నారా?

సురక్షితం కాని దేశం

'ఒక స్త్రీ అర్ధరాత్రి క్షేమంగా నడిచి వెళ్లినప్పుడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్య్రం వచ్చినట్టు' అని గాంధీజీ ఏ ముహూర్తంలో అన్నారో కాని అలాంటి స్థితి నేటికీ రాకపోగా నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. ఎన్ని చట్టాలు చేసినా, శిక్షలు తెచ్చినా స్త్రీలను గౌరవించాలి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలి అని మెజారిటీ సమాజం అనుకోవడం లేదు. 'నస్త్రీ స్వాతంత్య్ర మర్హతి' అనే భావన సమాజంలో ఆది కాలం నుంచి చొప్పించి ఉండటం వల్ల స్త్రీ చేసే ప్రతి పనిలో తప్పు ఎంచడం, అదుపు చేయడం, చులకనగా చూడటం, వివక్ష చూపడం, దండించడం ఆనవాయితీగా మారింది. పిల్లల పెంపకం దశ నుంచే స్త్రీలను గౌరవించడం నేర్పించడం లేదు. ఇంట్లో అమ్మాయిని ఒకలాగా, అబ్బాయిని ఒకలాగా పెంచడం వల్ల ఈ అబ్బాయిలు 'సమాజం'గా మారి స్త్రీ పాలిట బెడదగా మారుతున్నారు. తమ మాటకు ఎటువంటి తిరస్కారం చెప్పినా పురుషుడు శిక్షించేవాడై స్త్రీని చంపేందుకు వెనుకాడటం లేదు. స్త్రీకి ఒక అభిప్రాయం కలిగి ఉండే స్వాతంత్య్రం ఆమెకు ఎందుకు ఇవ్వడం లేదు?

స్త్రీలను ప్రేమ, మర్యాద, గౌరవాలతో కుటుంబం చూసుకోవాలి. అప్పుడు ఆ మర్యాద, గౌరవాలు సమాజంలోకి ఆటోమేటిక్‌గా వస్తాయి. కుటుంబం స్త్రీకి ఎలా రక్షణ ఇస్తుందో సమాజం కూడా స్త్రీకి అలా రక్షణ ఇవ్వాలనే పౌర శిక్షణ, సంస్కారం అవసరం. పురుషులు మాత్రమే కాదు స్త్రీలు కూడా కుటుంబం, సమాజం, దేశం కోసం గొప్పగా ఆలోచించగలరు. వారికి స్వేచ్ఛ, స్వాతంత్య్రం ఇచ్చి చూస్తే తెలుస్తుంది. అటువంటి వేకువలోకి దేశం ఉదయించాలని ఈ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కోరుకుందాం.



● ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్. శిక్ష(ణ)లో ఉన్న మహిళలే నిర్వాహకులు

77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా...
ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్

కారాగారంలో గడిపే సమయం శిక్ష సమయం కాదు, శిక్షణ సమయం. కారాగారం మానసిక పరివర్తన దిశగా శిక్షణ ఇచ్చే ప్రదేశం. శిక్ష పూర్తయి విడుదలైన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడానికి అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా ఇచ్చే ప్రదేశంగా ఉండాలి. అలాగే ఉంటాయి కూడా. అయితే ఈ ఏడాది దేశం మరో అడుగు ముందుకేసింది. శిక్ష అనుభవిస్తున్న మహిళలకు ఉపాధి అవకాశాలను జైలు గోడల మధ్య కాకుండా సమాజంలో కల్పించడం ఈ స్వాతంత్య్ర దినోత్సవం ప్రత్యేకత.

చెన్నై నగర శివారులో అంబత్తూరు– పుఝల్ రోడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు 'ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్' అనే ప్రయోగాత్మకమైన సంస్కరణకు వేదికైంది. పుఝల్ మహిళల కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మహిళల్లో ముప్పై మందికి ఉద్యోగం ఇచ్చింది. దేశంలో ఇదే మొదటి ప్రయత్నం. ఈ ప్రయత్నంతో ఈ పెట్రోల్ బంకు ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్ అనే గౌరవ సూచికకు అర్హత సాధించింది. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పన్నెండు గంటలు మహిళలు విధులు నిర్వర్తిస్తారు. ఆ తర్వాత పురుష ఖైదీలు విధుల్లోకి వస్తారు.

ఖైదీలు తమ శిక్ష కాలం పూర్తయిన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడం కోసం రకరకాల వృత్తుల్లో శిక్షణ ఇస్తారు. అవన్నీ జైలు గోడల మధ్యనే ఉంటాయి. మారుతున్న సమాజానికి తగినట్లు కొత్త కొత్త ఉపాధి మార్గాలకు తగిన ఏర్పాట్లు ఉండవు. అందుబాటులో ఉన్న పనుల్లోనే శిక్షణ ఇవ్వడమే జరిగేది. ఇదిలా ఉంటే... జైళ్లలో మహిళా ఖైదీలకు తగిన సౌకర్యాల పర్యవేక్షణ కోసం అన్ని రాష్ట్రాల్లో పర్యటించిన మహిళా కమిషన్ సభ్యుల పరిశీలనలో కొత్త విషయాలు తెలిశాయి. జైలు గోడల మధ్య ఉండడం వల్ల మహిళలు మానసికంగా కుంగుబాటుకు లోనవుతున్నారని, వారికి సమాజంలో భాగస్వామ్యం కల్పించాలని సూచించడంతో, ఆ సూచనను అందుకున్న జైలు అధికారుల్లో మొదటగా పుఝల్ జైలు అధికారులు ఈ ప్రయత్నం చేశారు. మహిళలకు పెట్రోల్ పట్టడంలో శిక్షణ ఇవ్వడంతోపాటు వినియోగదారులతో మాట్లాడడం, ఉద్యోగానికి తగిన ప్రవర్తనా నియమావళిలో కూడా మహిళలకు శిక్షణ ఇప్పించారు.

పెట్రోల్ బంకులో విధులు నిర్వర్తిస్తున్న మహిళలు తమకు స్వాతంత్య్రం వచ్చినట్లు సంతోషిస్తున్నారు. శిక్ష కాలాన్ని ఆనందంగా పూర్తి చేస్తామని, పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో సమాజంలోకి విడుదలవుతామని చెప్పారు.

శిక్ష కాలం సమాజంలోనే!

శిక్షణ కాలంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణలు తీసుకు రావడంతోపాటు ఖైదీలను సమాజంతో అనుసంధానం చేయడం, వారి పునరావాసం కోసం పని చేయడం కూడా అవసరమే. ఆ అవసరాన్ని గుర్తించి మహిళలతోనే ముందడుగు వేసింది జైళ్ల శాఖ. శిక్ష సమయంలో కూడా సమాజంలో మనుషులతో మాట్లాడుతూ ఉంటే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. సమాజానికి దూరంగా ఉన్నామనే ఆవేదన దూరమవుతుంది. సమాజంలోనే నివసిస్తున్న భావనతో జీవిస్తారు.

స్వాతంత్య్రాన్ని ఇలా ఎంజాయ్ చేయండి!

నేటి టెక్నాలజీ యుగంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని హాలిడేగా తీసుకుని ఆనందించే వారే ఎక్కువ. స్కూలు, కాలేజీ విద్యార్థులైతే జెండా వందనం తరువాత ఇంటికెళ్లిపోవచ్చు అని తెగ సంబరపడిపోతుంటారు. కానీ డెబ్బై ఆరేళ్లుగా విరామం లేకుండ జరుపుకొంటూ నేడు 77వ వసంతంలో అడుగు పెట్టాం. దేశాన్ని పాలించే అధికారులు అధికారికంగా ఈ వేడుకలు జరిపిస్తున్నారు. బాధ్యత గల పౌరులుగా మనం ఇలా సెలబ్రేట్ చేసుకుందాం....



● ఉదయాన్నే ఎర్రకోటపై జరిగే జెండావందనం, వివిధ కార్యక్రమాలను టీవీలో చూడాలి. డెబ్బై ఏడేళ్ల స్వాతంత్య్ర భారతం ఎంత ఎత్తుకు ఎదిగిందన్న అంశాలను ప్రత్యక్ష ప్రసారాలు చూడడం ద్వారా తెలుసుకోవచ్చు ● తరువాత ఎప్పటి నుంచో అనుకుంటున్న ప్లేసుకి ఈరోజు వెళ్లండి. ఒక రోజులో వెళ్లిరాగల ప్రాంతానికి వెళ్లి అక్కడ గడిపి మీ ఒత్తిడిని దూరం చేసుకోండి. అక్కడ స్వతంత్ర దినోత్సవాన్ని గుర్తుండిపోయేలా గడపండి. ● రోజూ వేసుకునే దుస్తులు కాకుండా భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలాంటి దుస్తులు ధరించండి. వీలైనంత వరకు డ్రెస్‌లో తెలుపు, కాషాయం, ఆకుపచ్చని రంగులు ఉండేలా చూసుకుని వేసుకోవాలి. అప్పుడు త్రివర్ణ పతాకానికి మరింత వన్నె తెచ్చినవారవుతారు ● ఎక్కడికీ వెళ్లే ఓపిక లేనప్పుడు ఇంట్లోనే ఉండి దేశభక్తి సినిమాలు చూడండి. మీతోపాటు మీ పిల్లలకు మన దేశ చరిత్ర, ఔన్నత్యాలు తెలుస్తాయి ● మరింత ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకోవాలంటే మూడు రంగులు ఉండేలా వెరైటీ డిష్‌లు తయారు చేసుకుని తినండి ● స్వాతంత్య్ర దినోత్సవం అర్థం ఉట్టిపడేలా గాలిపటాలు ఎగరవేయండి. మూడు రంగుల్లో ఉన్న గాలిపటాలను వీలైనంత ఎత్తుకుఎగరేస్తూ మనకొచ్చిన స్వేచ్ఛను ఎంజాయ్ చేయవచ్చు ● పుస్తకాల పురుగులు అయితే దేశభక్తి పుస్తకాలను చదవండి. స్వాతంత్య్ర సమర యోధుల విజయగాథలు, వీరిలో బాగా పాపులర్ అయిన నాయకుల బయోగ్రఫీని చదివి ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు ● దేశభక్తి గీతాలు వింటూ కూడా సంబరాలు జరుపుకోవచ్చు. అలనాటి పోరాట, అసామాన్య త్యాగాలను గుర్తుచేసే పాటలను వినాలి. లతా మంగేష్కర్, మహ్మద్ రఫీ, ఏఆర్ రెహ్మాన్ పాటలు మనలో నిద్రపోతున్న దేశభక్తిని తట్టి లేపుతాయి ● ఇంటి చుట్టుపక్కల వారు లేదా బంధువులు, కుటుంబ సభ్యులతో దగ్గరలో జరుగుతోన్న జెండా పండుగకు వెళ్లి రెపరెపలాడే త్రివర్ణ పతాకానికి జైహింద్ కొట్టాలి ● దేశానికి పెద్ద సేవ చేయలేక పోయినప్పటికీ మీ చుట్టుపక్కల ఉన్న వారందరికి స్వీట్లు పంచి, నోరు తీపి చేస్తూ స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోండి.

ప్రతి భారతీయుడికి ఎంతో విలువైన బహుమతులు స్వేచ్ఛా స్వాతంత్య్రాలు. అందుకే వీలైనంత వరకు అందరితో కలిసి జరుపుకోవాల్సిన జెండా పండుగ ఇది. సెలవు దొరికింది అని సంబరపడిపోక వీటిలో ఏ ఒక్కదాన్ని పాటించినా స్వాతంత్య్ర దినోత్సవాన్ని గౌరవించినట్లే.

జీవన సేద్యం!

● పెద్ద కమతాల్లో సేంద్రియ వరి సేద్యంలో జీవన ఎరువులు/పురుగుమందులు కీలకం



● వ్యవసాయ క్షేత్రంలో సిద్ధమవుతున్న జీవన ఎరువులు

సాగుబడి

అశ్లేష కార్తె: ఆగస్టు 17 వరకు
మఖ: 18 నుంచి

సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ద్రావణాలు, కషాయాలను చిన్న, సన్నకారు రైతులు తయారు చేసుకొని వాడగలుగుతున్నారు. అయితే, ఎక్కువ విస్తీర్ణంలో సేంద్రియ/ప్రకృతి సేద్యం చేసే పెద్ద రైతులకు వీటి తయారీ కష్టం కావటంతో జీవన ఎరువులు, జీవన పురుగుమందులను విరివిగా వినియోగిస్తున్నారు. రైతు శాస్త్రవేత్త, తునికిలోని ఏకలవ్య కేవీకే సలహాదారు, హార్ట్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు గత కొన్ని సంవత్సరాలుగా చిన్న, పెద్ద కమతాల్లో సాగు చేసే రైతులతో కలసి పనిచేస్తున్నారు. ఖరీఫ్/లేటు ఖరీఫ్ వరి సాగులో చిన్న కమతాల రైతులు, పెద్ద కమతాల రైతులు ఏయే ఉత్పాదకాలను, ఎంతెంత మోతాదులో వాడితే మంచి ఫలితాలు వస్తున్నాయన్న అంశాలను ఆయన 'సాక్షి సాగుబడి'కి ఇలా వివరించారు.

వరి నారుమడిని నీరు నిలవని విధంగా తయారు చేసుకోవాలి. విత్తనాన్ని ఒక రోజు ముందు ఎండబెట్టి మరునాడు విత్తన శుద్ధి చేయాలి. నిద్రావస్థ ఉన్న విత్తనాలను, నిద్రావస్థ తొలగించడానికి గోరువెచ్చని నీటిలో నానబెట్టి, అనంతరం విత్తనాలను నారుమడిపై వెదజల్లాలి. 2వ రోజు నీరు బయటకు తీయాలి. 5వ రోజు నీరు పెట్టాలి. తర్వాత తగినంత నీరు ఇస్తుండాలి. చాలా ప్రాంతాల్లో నారు 6 అంగుళాల సైజు నుంచి 10 అంగుళాల సైజు వచ్చినప్పుడు మాత్రమే ఊడ్పు/నాట్లు వేస్తుంటారు. నాట్లు వేసిన 7 రోజులకు.. చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాట్లు వేయాలి.

ప్రధాన పొలాన్ని ఊడ్పుకు ముందు 20 రోజుల నుంచి దఫ దఫాలుగా వారానికి ఒకసారి దుక్కి దున్ని, చదును చేసుకోవాలి. ఎకరాకు 3 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు వెయ్యాలి. నాట్లతో పాటుగా వివిధ రకాల జీవన ఎరువుల (బ్యాక్టీరియాల)ను ఇవ్వాలి. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం ఉండేలా వరి నాట్లు వేయాలి. మధ్యలో కాలి బాటలు తీయాలి. గట్లపై నువ్వుల విత్తనాలను చల్లుకుంటే నువ్వుల పువ్వులు ఎనాగరస్ అనే కీటకాన్ని ఆకర్షించటం ద్వారా తెల్లదోమ నివారణ జరుగుతుంది.

సేంద్రియ వరి సాగులో చిన్న, పెద్ద రైతులకు అనువైన ఉత్పాదకాల పట్టిక

వివరణ	చిన్న రైతులకు అనువైన ప్రాచీన పద్ధతులు	పెద్ద రైతులకు అనువైన ఆధునిక పద్ధతులు
1వ రోజు విత్తనశుద్ధి	బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి	హ్యూమిక్ యాసిడ్, బవేరియా, మెటారైజియం, సూడోమోనాస్
10వ రోజు పిచికారీ	జీవామృతం + పంచగవ్య + పుల్ల మజ్జిగ	మీనామృతం + సూడోమోనాస్+ తౌడు కషాయం
12వ రోజు ఎరువు	ఘనజీవామృతం	ఘనజీవామృతం / వర్మీకంపోస్టు + హ్యూమిక్ ఆసిడ్
20వ రోజు సస్యరక్షణ	ఆగ్నేయ అస్త్రం + జీవామృతం + మొలకల ద్రావణం	మీనామృతం + బేవేరియా, మెటారైజియం + వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
ఊడ్పు అనంతరం 22వ రోజు స్ప్రే	పంచగవ్య + అగ్ని అస్త్రం + పుల్ల మజ్జిగ	మీనామృతం+బవేరియా +మెటారైజియం+ వెర్టిసీలియం + కొబ్బరి నీరు పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగుకు ల్యూర్ పెట్టాలి లేదా ట్రైకోగ్రామా కార్డులు పెట్టాలి లేదా తూజా 200 (హోమియో) పిచికారీ చేయాలి.
25వ రోజు ఊడ్పు	ఘనజీవామృతం 1 టన్ను / 1 ఎకరం + వేప పిండి 200 కిలోలు/ఎకరం	ఘనజీవామృతం 1 టన్ను/ 1ఎ + బ్యాక్టీరియాలు, ఎన్‌పికె, బవేరియా, మెటారైజియం బాక్టీరియాలు.
25 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
35 రోజులకు	మొలకల ద్రావణం + ఆగ్నేయ అస్త్రం + ఇంగువ కషాయం లేదా పుల్ల మజ్జిగ పిచికారీ చేయాలి.	మీనామృతం, సోయాబీన్, పెసలు మొలకల ద్రావణం, సూడోమోనాస్, బవేరియా, మెటారైజియం, వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
40 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
45 రోజులకు	మొలకల ద్రావణం + వేప గింజల కషాయం	మీనామృతం + నేల వేము కషాయం + ఉలవల కషాయం
45 రోజులకు	ఘనజీవామృతం 500 కిలోలు/1 ఎకరం	ఘనజీవామృతం 500 కిలోలు / 1 ఎకరం
65వ రోజు పిచికారి	మొలకల ద్రావణం + ఇంగువ కషాయం + పసుపు దుంపల కషాయం + ఆగ్నేయ అస్త్రం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + వావిలాకు కషాయం
80వ రోజు పిచికారీ	మొలకల ద్రావణం + పుల్ల మజ్జిగ + దశపర్ణి కషాయం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + బవేరియా



● జీవామృతం

మోతాదు ఎంత?

● ఎకరం పంటకు సగటున 100–120 లీ. నీటిని పిచికారీ చేయాలి ● మీనామృతాన్ని నారుమడిపై లీ. నీటికి 5 ఎం.ఎల్., పైరు ఎదిగిన దశలో లీ. నీటికి / 10ఎం.ఎల్. చొప్పున కలిపి పిచికారీ చేయాలి ● బవేరియాను లీ. నీటికి /10 గ్రా. కలిపి పిచికారీ చేయాలి ● మెటారైజిమ్ లీ. నీటికి/10 గ్రా. వాడాలి ● హ్యూమిక్ యాసిడ్ కిలో విత్తనాలకు/10 గ్రా. వాడాలి. ● కిలో నేల వేము పొడిని 100 లీ. నీటిలో కలిపి కషాయం తయారు చేయాలి ● 1500 గ్రా. వావిలాకు పొడిని కషాయం చేసుకొని 100 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● ఎకరానికి రకానికి ఒక కిలో చొప్పున జీవన ఎరువులు వాడాలి ● లీ. నీటికి 10 ఎం.ఎల్. కొబ్బరి నీరు కలపాలి ● పంచగవ్య నారుమడిలో పిచికారీకి లీ. నీటికి 5 ఎం.ఎల్. కలపాలి. పైరు ఎదిగే దశలో పిచికారీకి లీ. నీటికి 20 ఎం.ఎల్. కలపాలి ● అర కేజీ ఇంగువతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● 200 గ్రా. పసుపును కషాయం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 2 కిలోల మొలకలతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 6 లీ. పుల్ల మజ్జిగను వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేయాలి. ● ఆగ్నేయ అస్త్రం తయారీలో మిర్చి, అల్లం, వెల్లుల్లిలను అర కిలో చొప్పున తీసుకొని నూరి కషాయం తయారు చేసి వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

(ఇతర వివరాలకు.. సుబ్రహ్మణ్యం రాజు మొబైల్: 76598 55588)

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

ఎడారిలో ఆశల మొలక



● థార్ ఎడారిలో సాగవుతున్న మొలకగడ్డి

ప్రపంచంలోనే అత్యధిక పాలను ఉత్పత్తి చేస్తున్న మన దేశంలో పచ్చిగడ్డి లభ్యత 11 శాతం తక్కువగా ఉందని భారతీయ గడ్డి నేలలు, పశుగ్రాస పరిశోధనా సంస్థ లెక్కగట్టింది. భూతాపం ప్రమాదకరమైన రీతిలో పెరుగుతున్న ప్రస్తుత కాలంలో పచ్చిగడ్డి సాగుకు హైడ్రోపోనిక్స్ పద్ధతి చక్కని ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఈ పద్ధతిలో తక్కువ స్థలంలో, పది శాతం నీటితోనే ఏడాది పొడవునా మొలక గడ్డిని పెంచుకోవచ్చు. మొలక గడ్డిని పాడి ఆవులు, గొర్రెలు, మేకలకు మేపటం మన రాష్ట్రాల్లోనే కాదు.. రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంత పశుపోషకులను సైతం ఆకర్షిస్తోంది. అక్కడ ఏడాదిలో రెండు నెలలే వర్షం పడుతుంది. మండు వేసవిలో ఎండ వేడి 120 డిగ్రీల సెల్షియస్‌కు చేరుతుంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో జీవించే థార్ ప్రాంత రైతులు, సంచార పశుపోషకులు స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌ల తోడ్పాటుతో ఇటీవల హైడ్రోపోనిక్ మొలక గడ్డి సాగు చేపట్టారు. సునాయాసంగా నాణ్యమైన పాల దిగుబడితో పాటు ఆదాయాన్ని పెంచుకుంటున్నారు.



● మొలకగడ్డి వేస్తున్న మహిళారైతు పలు హేమారామ్

స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌లు ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకుల కోసం హైడ్రోపోనిక్ మొలక గడ్డిని పెంచే షెడ్లను నెలకొల్పుతున్నాయి. రైతులే వాటిలో మొక్కజొన్నలు, గోధుమలను నానబెట్టి, వర్టికల్ గార్డెన్ మాదిరిగా అనేక దొంతర్లలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్రేలలో మొలక గడ్డిని పెంచుతున్నారు. సాధారణంగా పొలంలో పచ్చిగడ్డిని పెంచడానికి 2 నెలలు పడుతుంది. మొలక గడ్డి 8 రోజుల్లో పెరుగుతుంది. ముఖ్యంగా పది శాతం నీటితోనే ఈ గడ్డి పెరగటం థార్ ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకులకు ఉపయుక్తంగా మారింది.

స్వచ్ఛంద సంస్థ ఉర్ముల్ సీమంత్ సమితి, డిజర్ట్ రిసోర్స్ సెంటర్‌తో కలసి హైడ్రోగ్రీన్స్, బహుళ నేచురల్స్ స్టార్టప్‌లు మొలక గడ్డి ఉత్పత్తి యూనిట్లను థార్ ఎడారి గ్రామాల్లో ఏర్పాటు చేస్తుండటంతో కొందరు మహిళా రైతులు హాయిగా ఊపిరిపీల్చుకుంటున్నారు. బహుళ నేచురల్స్ వీరి వద్ద నుంచి దేశీ ఆవు పాలను, ఒంటె పాలను సేకరించి, విలువ జోడించి ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. వెయ్యి మంది పాడి రైతులు, 4 వేల మంది పశుపోషకులు తమ ఆవులు, మేకలకు మొలక గడ్డిని మేపుకుంటూ ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం పొందుతున్నారు.

పశుపోషణ కోసం గొడ్డు చాకిరీ చేసే మహిళా రైతులకు మొలక గడ్డి అందుబాటులోకి రావటం గొప్ప ఊరటనిస్తోంది. మొలక గడ్డి మేపుతో దేశీ ఆవు పాల దిగుబడి మూడింట ఒక వంతు పెరగడంతో పాటు, నాణ్యత కూడా పెరిగిందని రాజస్థాన్‌లోని ఘంటియాలి గ్రామానికి చెందిన దళిత మహిళా పశుపోషకురాలు 'పలు', ఆమె భర్త హేమారామ్ సంతోషంగా చెబుతున్నారు. వీరికి 8 ఆవులు, మేకలు ఉన్నాయి. 4 మైళ్ల దూరంలో ఉన్న పొలానికి వెళ్లి గడ్డి కోసుకొని, ఎండలో నెత్తిన పెట్టుకొని మోసుకు రావటం ఆమెకు కనాకష్టంగా ఉండేది. రెండేళ్ల క్రితం ఇంటి పక్కనే మొలకగడ్డి ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాక ఆ బాధ తప్పింది. మిగులు గడ్డిని, గోధుమ గడ్డి పొడిని అమ్ముతూ ఆదాయం పొందుతుండటం విశేషం.

దూడలకు పెట్టే కాన్సంట్రేట్ మిక్చర్ దాణాను 75% తగ్గించి మొక్కజొన్న మొలక గడ్డిని మేపటం వల్ల మంచి ఫలితం కనిపించిందని బికనెర్ వెటరినరీ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కె. ధురియా అన్నారు. హైడ్రోపోనిక్ మొలక గడ్డి వల్ల మేకల్లో జీర్ణశక్తి, పెరుగుదల బాగుందని సౌదీ అరేబియాలోని కింగ్ సౌద్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. మొలకగడ్డి యూనిట్ ఏర్పాటుకు రూ. 18 లక్షల నుంచి 25 లక్షల వరకు ఖర్చవుతోంది. అయితే, ఇసుక తుపాన్లకు మొలకగడ్డి షెడ్లు దెబ్బతినటం వల్ల నష్టం జరుగుతోంది.

అందుకని, ముందుందు షిప్పింగ్ కంటెయినర్లలో మొలకగడ్డి ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయటమే దీనికి పరిష్కారమని బహుళ నేచురల్స్ భావిస్తోంది. లక్షల ఖర్చుతో కూడిన పని కావటంతో రైతులను బృందాలుగా ఏర్పాటు చేసి మొలకగడ్డి యూనిట్లను నెలకొల్పితే మేలు. అయితే, రూ. 17.500 ఖర్చుతో చిన్నపాటి మొలకగడ్డి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని హైడ్రోగ్రీన్స్ స్టార్టప్ చెబుతోంది.

బయోచార్‌తో సేంద్రియ ఇంటిపంటల సాగుపై శిక్షణ

సేంద్రియ ఇంటిపంటల సాగుపై పట్టణ/నగర వాసులపై ఆసక్తి పెరుగుతోంది. బయోచార్ (బొగ్గుపొడి) కలిపిన మట్టి మిశ్రమంతో టెర్రస్ గార్డెన్లు, పెరటి తోటలు, బాల్కనీలలో కూరగాయల పెంపకంపై ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్ మలకపేటలోని న్యూలైఫ్ ఫౌండేషన్ శిక్షణ ఇవ్వనుంది. మిగులు పంట దిగుబడులను సోలార్ డ్రయ్యర్‌తో ఎండబెట్టే విధానం కూడా వివరిస్తామని న్యూలైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివ షిండే తెలిపారు. వివరాలకు.. 81210 08002.

17న అమలాపురంలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

శ్రీనివాస సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17న కోనసీమ జిల్లా అమలాపురంలోని (ముక్తేశ్వరం– కొత్తపేట రోడ్డు) శ్రీసత్యనారాయణ గార్డెన్స్‌లో ప్రకృతి వ్యవసాయంపై నిపుణులు విజయరామ్ రైతులకు అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు నిమ్మకాయల సత్యనారాయణ తెలిపారు. ప్రవేశం ఉచితం. ముందుగా పేరు నమోదు చేసుకోవాలి. వివరాలకు.. 64091 11427 (సా. 3 గం. నుంచి 6 గం. వరకు మాత్రమే).